సాక్షి
పల్నాడు
ఆదివారం । 21 । మే । 2023




నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.



పిడుగుపడి చెట్టు దగ్ధం

సత్తెనపల్లి: ఇళ్ల మధ్య ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడిన సంఘటన పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో శనివారం జరిగింది. దీంతో కొబ్బరి చెట్టు మొదళ్లలో మంటలు చెలరేగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు.

ఖరీఫ్‌కు ముందే 'భరోసా'

పగలనక, రేయనక.. ఎండనక, వాననక పంటపొలాల్లో కష్టించి పనిచేసే రైతన్నకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటోంది. విత్తు నుంచి పంట ఉత్పత్తుల కొనుగోలు వరకు అన్ని రకాల సేవలందిస్తూ అభయమిస్తోంది. ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని సాగు ప్రారంభించే దుస్థితిని మార్చి.. సాగు ప్రారంభానికి సంపూర్ణ 'భరోసా' నందిస్తోంది. గత నాలుగేళ్లుగా వైఎస్సార్ రైతు భరోసా అందించి అన్నదాతలను ఆదుకున్న ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది సాయం అందించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది.

- 18వ తేదీతో ముగిసిన సామాజిక తనిఖీ
- రైతు భరోసా పంపిణీకి చర్యలు
- ఐదో ఏడాది మొదటి విడతగా జమకానున్న రూ.7,500
- జిల్లాలో 2,72,072 మందికి చేకూరనున్న లబ్ధి



వరినాట్లు (ఫైల్)

యడ్లపాడు: గతంలో అన్నదాతలు పొలాలను సాగు చేసుకునేందుకు సీజన్ ప్రారంభంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. రైతు అభ్యున్నతిని కాంక్షిస్తూ వ్యవసాయ రంగంలో అనేక పథకాలను అమలు చేస్తున్నారు. భూసార పరీక్షల నుంచి దిగుబడుల కొనుగోలు వరకు వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ముఖ్యంగా ఏటా ఖరీఫ్ ప్రారంభ సమయంలో పంటల సాగుకు రైతన్నలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతు భరోసాపథకం ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నారు.

ఈ ఏడాది కొత్తగా 5237 మందికి అర్హత..

రైతుభరోసా పథకం ద్వారా జిల్లాలో ఐదోసారి మొదటి విడత నగదును రైతుల అకౌంట్లలో జమ చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతున్నారు. ఈ పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500 నాలుగేళ్లుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తుంది. 2022–23లో పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 28 మండలాల్లో 2,66,871 మంది సాగుదారుల ఖాతాల్లో రూ.357 కోట్లు జమ అయింది. 2023 – 24కు గాను తొలివిడత పెట్టుబడిసాయం అర్హులైన అన్నదాతల ఖాతాల్లో జమచేసేందుకు వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 5237 మంది అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కేవలం 36 అర్జీలు మాత్రమే అనర్హమైనవిగా గుర్తించి అధికారులు తిరస్కరించారు. మిగిలిన జాబితాలు ఆయా మండలాల్లోని 421 ఆర్‌బీకేల్లోని నోటీస్ బోర్డుల్లో ఉంచారు. వీటిపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో రైతు భరోసా పథకం పొందేందుకు అర్హత కల్పించారు. ఖరీఫ్ సాగులో దుక్కులు దున్నుకునేందుకు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు నగదు అందజేస్తుండటంపై కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతలుగా...

వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ కింద ప్రభుత్వం ఏటా మూడు విడతల్లో రూ.13,500 అందజేస్తుంది. రూ.7,500 మేనెలలో, రూ.4వేలు అక్టోబర్‌లో, మిగిలిన రూ.2వేలు జనవరిలో జమ చేస్తున్నారు. భూ యజమానులకు మాత్రమే సీఎం కిసాన్ కింద కేంద్ర మూడు విడతల్లో రూ.6వేలు చొప్పున జమ చేస్తోంది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న కౌలుదారులకు రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

పెట్టుబడికి ఉపయోగం



గ్రామంలో సొంతగా 1.62 ఎకరాల మెట్టభూమి ఉంది. మాకు తొలినుంచి రైతు భరోసా పథకం అందుతుంది. సాగు ప్రారంభంలోనే పథకం డబ్బులు రావడంతో కొంతమేర ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. అయితే గతేడాది నా భర్త అనారోగ్యంతో చనిపోయారు. పథకం పేరిట వచ్చే డబ్బులు ఆగకుండా ఆర్‌బీకే సిబ్బంది నాపేరును చేర్చారు. జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాను.

– కర్నాటి నాగలక్ష్మి, రైతు, యడ్లపాడు

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గత ప్రభుత్వాలు రైతుల గురించి పట్టించుకోలేదు. నాలుగేళ్ల నుంచి ఏటా రూ.13,500 రైతుభరోసా డబ్బులు మా బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యపు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– గాయం ధనకోటిరెడ్డి, రైతు, కారుచోల

అర్హులందరికీ అందజేస్తాం



రాష్ట్ర ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పించాలని ఆదేశించింది. వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదు. ఇప్పటికే అర్హుల జాబితాల్ని ఆర్‌బీకేల్లో ప్రదర్శించాం. అర్హత ఉండి పథకం డబ్బులు పడనివారు, ఇటీవల భూమి కొనుగోలు చేసి సాగుకు సిద్ధమవుతున్నవారు, కొత్తగా సాగు చేసేవారి నుంచి అర్జీలు తీసుకుని అర్హత కల్పించాం.

– మురళి, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి

ప్రశాంతంగా ఏపీఆర్‌జేసీ పరీక్ష



నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష (ఏపీఆర్ జేసీ సెట్) శనివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పరిధిలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 10 పరీక్ష కేంద్రాలలో జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియేట్) ప్రవేశానికి 2,387మంది, డిగ్రీ కళాశాలల ప్రవేశానికి ఒక కేంద్రంలో 126మంది విద్యార్థులు నమోదయ్యారు. కాగా మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించిన జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్షకు 2,387మందికి గాను 1946మంది, డిగ్రీ ప్రవేశానికి 126మందికి 107మంది విద్యార్థులు హాజరైనట్లు ఏపీఆర్‌జేసీ జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియేట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు, డిగ్రీలో బి.ఎ, బి.కాం, బీఎస్సీ ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. అలాగే ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నాలుగు పరీక్ష కేంద్రాలలో గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఐదవ తరగతిలో చేరేందుకు 515మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు నమోదు కాగా 420మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అలాగే 6వ తరగతిలో మిగిలిపోయిన సీట్లకు 194మందికి గాను 151మంది, 7వతరగతికి 106మందికి 82, 8వ తరగతిలో మిగిలిపోయిన సీట్లకు 107మందికి గాను 86మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

న్యూస్‌రీల్

మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టండి



నరసరావుపేట: జిల్లాలోని 21 జగనన్న కాలనీల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం కోసం తాత్కాలిక నీటిసరఫరా చేసేందుకు మోటార్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆశాఖ ఎస్‌ఈని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశం హాలులో నవరత్నాలు–పేదలందరికీ గృహాలు పథకంలో జరుగుతున్న పనులపై మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. నరసరావుపేట మండలం ఇక్కుర్రు లేఅవుట్‌లో పదిరోజుల్లో పనులు పూర్తిచేసి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను పంచాయతీరాజ్ ఎస్‌ఈ, మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి కల్పించాలని పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈని ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్‌లకు లక్ష్యాలను నిర్దేశించాలని లేఅవుట్ ప్రత్యేకాధికారులకు సూచించారు. అలాగే సత్తెనపల్లి గుండ్లూరు లేఅవుట్‌లో అంతర్గత రహదారులు, లెవలింగ్ పనులను పూర్తిచేయాలని పంచాయతీరాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే వారం రోజుల వ్యవధిలో ప్రతి లేఅవుట్‌లో ప్రస్తుతం ఉన్న స్టేజ్ నుంచి తదుపరి దశలకు తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. జిల్లా హౌసింగ్ అధికారి కె.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం



బాపట్ల అర్బన్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ వార్షిక స్నాతకోత్సవంను వ్యవసాయ కళాశాల బాపట్ల ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన డాక్టర్ బి.వి.నాథ్ ఆడిటోరియం నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం బాపట్ల ఏజీ కాలేజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 55వ వార్షిక స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, ఆహార శుద్ధి శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పాల్గొననున్నట్లు వెల్లడించారు. డిపార్టుమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ ఫరోడా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా 993 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.రామారావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ పి.సుధాకర్, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ సి.హెచ్.చిరంజీవి, అసోసియేటెడ్ డీన్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గవర్నర్ కోసం ఏర్పాట్లు పరిశీలన

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఈనెల 22న జరగనున్న 55వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్న దృష్ట్యా ఏర్పాట్లను జేసీ శ్రీధర్ పరిశీలించారు. కళాశాల్లోని బి.వి.నాథ్ ఆడిటోరియాన్ని పరిశీలించారు. విజిటర్ల రాక, విద్యార్థులు కూర్చోనేందుకు ఏర్పాట్లుపై వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గోడౌన్ల పరిశీలన..

బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ గోడౌన్లను జేసీ శ్రీధర్ పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్లను తరచుగా విజిట్ చేయాల్సిందిగా ఆర్డీఓ రవీంద్రబాబును ఆదేశించారు. జేసీతోపాటు తహసీల్దార్ సుధారాణి ఉన్నారు.

రాష్ట్ర ప్రగతిని దశదిశలా చాటిన కేబీఆర్

మాజీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో మంత్రి అంబటి



నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి, మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు కాసు మహేష్, బొల్లా

నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ గొప్పదనాన్ని దేశానికి చాటిన మహానుభావుడు కాసు బ్రహ్మానందరెడ్డి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలతో కలిసి పల్నాడురోడ్డులోని ఆయన విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేబీఆర్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడిగా, గవర్నర్‌గా అనేక పదవులు నిర్వహించి ఈ ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేసి పల్నాడును సస్యశ్యామలం చేశారని కొనియాడారు. సీఎంగా బీసీ వర్గాలకు మొదటిసారిగా రిజర్వేషన్, లంబాడీ వర్గాలకు ఎస్టీలకు గుర్తింపు కల్పించారన్నారు. వినుకొండ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ కేబీఆర్ వర్ధంతి సభలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి అనేక పదవులను చేపట్టి రాష్ట్ర రూపురేఖలే మార్చారన్నారు. నాగార్జునసాగర్, పోచంపాడు, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక భూమిక పొటించారన్నారు. 1970లో 92 బీసీ కులాల రిజర్వేషన్ కల్పించారని, రైల్వే సౌత్ సెంట్రల్ జోన్ తీసుకొచ్చారన్నారు. వైజాగ్‌లో స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి అప్పటి ప్రధాని ఇందిరాగాంధిచే పునాదిరాయి వేయించారన్నారు. తొలుత కాసు గృహం నుంచి విగ్రహం వరకు ర్యాలీగా బయలుదేరి వచ్చారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ పీడీ గాదె సుజాత, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల, కలెక్టర్

వెంకటపాలెం(తాడికొండ): సీఆర్డీయే పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఈ నెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు తలశిల రఘురామ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నిర్మలా, సీఆర్డీయే, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

- శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- శ్రీశైలం వెళ్తూ మీడియాతో మాటామంతీ..
- వినుకొండ రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి హామీ



స్పీకర్ తమ్మినేని

వినుకొండ(నూజెండ్ల): గత టీడీపీ పాలకుల విధానాల వల్లే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి పోయిందని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం శ్రీశైల క్షేత్రం దర్శనానికి వెళ్తూ, మార్గ మధ్యలో వినుకొండ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పరిపాలనలో శరవేగంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా ప్రాంతాల అభివృద్ధి జరుగుతోందన్నారు. ఉత్తరాంధ్రలో ఎయిర్‌పోర్ట్, కోస్టల్ కారిడార్, ఏడు పోర్ట్‌లతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సీఎం వైఎస్ జగన్‌ను అభినందించారని గుర్తుచేశారు. కేవలం అర్హత ఉంటే చాలు అన్ని సంక్షేమ పథకాలు వర్తించేలా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని, మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని స్పీకర్ తమ్మినేని మెచ్చుకున్నారు. పారిశ్రామిక వేత్తగా వేలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా ప్రజా ప్రతినిధిగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని కొనియాడారు. వినుకొండపై రామలింగేశ్వర ఘాట్ రోడ్డు నిర్మాణం, దేవాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ, సచివాలయం, హెల్త్ క్లినిక్‌ల ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేటటౌన్: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో బొప్పూడి నుంచి మురికిపూడికి వరకు రూ.1.39 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు పనులకు శంకుస్థాపన, గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మంత్రి రజిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు సచివాలయాల ద్వారా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందుతున్నాయన్నారు. పరిపాలనలో కనీవిని ఎరుగని స్థాయిలో సంస్కరణలు తీసుకొచ్చి జగనన్న ప్రజా పాలకుడిగా ఈ దేశానికే ఆదర్శంగా నిలచారని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఊరూరా సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. ఇలాంటి ఒక నాయకుడు వందేళ్లకు ఒక్కడే వస్తారని కొనియాడారు. జగనన్న తీసుకొచ్చిన సచివాలయాల వల్ల ప్రజలకు సత్వరమే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వల్ల సత్వరమే ప్రజలు వైద్య సేవలు పొందగలుగుతున్నారని వెల్లడించారు. ప్రజలకు సుపరిపాలన అందించటమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్ బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో ఈ నెల 24 నుంచి జూన్ ఒకటి వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్ కల్పించాలని, అవసరమైన వైద్యసేవలు అందించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేయాలన్నారు. పరీక్ష సమయంలో మాల్‌ప్రాక్టీస్ జరగకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లాలోని ఆర్డీవోలు ఎం.శేషిరెడ్డి, అద్దెయ్య, రాజకుమారి, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, పోలీసు, పోస్టల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి

ప్రతి ఒక్కరూ విధిగా ఎంఎల్ఎస్ పాయింట్లు, చౌకధరల దుకాణాలు, మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం తాడేపల్లి నుంచి వెబ్ఎక్స్ ద్వారా జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై అధికారులతో పౌరసరఫరాలశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ నిర్వహించిన సమీక్షకు జాయింట్ కలెక్టర్, అధికారులు హాజరయ్యారు.

టంగుటూరికి ఘన నివాళి

నివాళులర్పించిన మంత్రి అంబటి



టంగుటూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు నిరుపమానమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. టంగుటూరి వర్ధంతిని పురస్కరించుకొని శనివారం నియోజక వర్గ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జేఎన్‌టీయూకె పాలకమండలి సభ్యుడు మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు ఎం.శివకృష్ణప్రసాద్, సర్వేపల్లి బ్రాహ్మణ ఉద్యోగ సంఘాల సమితి అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.